
ప్రజానాయకుడు
బీజేపీ సీనియర్ నాయకులు
శ్రీ రవి కుమార్ యాదవ్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
శేరిలింగంపల్లి నియోజకవర్గం
బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు
శేరిలింగంపల్లి నియోజకవర్గం
TEAM RKY

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ ఐనుల్‌హసన్, పాల్గొన్న జర్నలిస్టులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ఆవిష్కరించారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధి బృందం మంగళవారం మనూ వీసీని కలిశారు. ఈ నెల 28వ తేదీన నగరంలో ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రతినిధి బృందం వివరించారు. తెలంగాణ తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఉర్దూ జర్నలిస్టులు ఈ సదస్సుకు హాజరవుతారని చెప్పారు.

రోడ్లపై మురుగు



రాయదుర్గం: రోడ్లపై మురుగునీరు పారుతోంది. గచ్చిబౌలి డివిజన్ టెలికామ్ నగర్‌లో డ్రైనేజీ కాలువలు పొంగి రోడ్లపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారని వేసవిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక వర్షాకాలంలో ఎలా అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మురుగు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిజ్ఞాస పోటీలలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లను అందుకుంటున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: విద్యాశాఖ నిర్వహించిన జిజ్ఞాస పరిశోధన పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు విద్యార్థులు ప్రతిభ చాటారు. హిందీ అధ్యాపకురాలు పూనం కుమారి ఆధ్వర్యంలో హిందీ భాష–ప్రపంచీకరణ అంశంపై పరిశోధకులు సరీన్ బేగం, అంకిత కుమారి, ప్రణీత, యాస్మిన్, యూనుస్ పరిశోధన చేశారు. వీరికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రూ.30 వేల నగదు పురస్కారం లభించింది. ఆంగ్ల విభాగంలో ప్రసంగాలు చేయటం ఎలా అనే అంశంపై ఆంగ్ల అధ్యాపకులు డీఎస్ఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో కమల్ తేజ, కిషోరి కుమారి, మేఘన, నేహా, సానియా బేగం పరిశోధన చేశారు. వీరికి రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి రూ.21 వేలు లభించింది. ఆచరణాత్మక విద్యలో భాగంగా చేసిన పరిశోధనలు విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతుందని కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిజ్ఞాస రాష్ట్రస్థాయి హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో బహుమతి ప్రదానోత్సవంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ప్రొఫెసర్ లింబాద్రి బహుమతులు అందజేశారు. జిజ్ఞాస రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను, పర్యవేక్షకులను కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్‌నగర్‌లో రూ.28 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని ,అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాజు, లక్ష్మీ, నాయకులు మాధవ్, కుమారస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు



నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో పచ్చడి మామిడి కాయల షాపులు



మామిడి కాయలు కట్ చేస్తున్న దశ్యం

పచ్చడి పెట్టేదెలా..?

- మార్కెట్‌లో మండిపోతున్న మామిడికాయల ధరలు.. రూ. 15 నుంచి 40
- మరికొన్ని రకాలు ఏకంగా రూ.80పైమాటే
- పెరిగిన నూనె, కారం ధరలు
- పచ్చడికాయలకు కేరాఫ్ అడ్రస్‌గా నల్లగండ్ల, తారానగర్ మార్కెట్లు

శేరిలింగంపల్లి: 'వేడి వేడి అన్నంలో ఆవకాయ తింటే ఆ రుచే వేరులే' అనే మాట ప్రతి ఒక్కరి నోటి నుంచి వెలువడే మాట. వేసవి వచ్చిందంటే ఇళ్లల్లో మామిడికాయ పచ్చడి పట్టినట్టే. ఐతే ఈ ఏడాది మామిడికాయలు, నూనె, ఎండుమిర్చి రేట్లు పెరగడంతో ఆవకాయ పచ్చడికి ధరల సెగ తగులుతోంది. ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల, తారానగర్ మార్కెట్‌లలో పచ్చడి మామిడికాయల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ ఏడాది అకాల వర్షాలు, ఈదురు గాలులతో కాయల దిగుబడి తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. నల్లగండ్ల, తారానగర్ మార్కెట్‌లకు బాటసింగారం, బోయిన్‌పల్లి నుంచి వివిధ రకాల కాయలు తీసుకువచ్చి అమ్ముతుంటారు.

అమ్మో.. ఇవేం ధరలు..

మార్కెట్‌లో మామిడికాయల ధర అడిగిన కొనుగోలుదారులు 'వామ్మో....ఇంత రేటా అని అంటున్నారు. పచ్చడి మామిడి కాయల ధరలు చూసి బెంబేలెత్తే పరిస్థితి నెలకొంది. కాయ సైజ్‌ను బట్టి రూ.15–40 వరకు పలుకుతుండగా జలాలు రూ. 60, బెల్ల పచ్చడి కాయలు ఒక్కోటి రూ. 60–80 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక అదే దారిలో నూనెలు, కారం, మసాలాలు కూడా పెరిగాయి.

కేరాఫ్ అడ్రస్‌గా..

- నల్లగండ్ల, తారానగర్ మార్కెట్లు పచ్చడి మామిడి కాయలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.
- ఇక్కడ ప్రధానంగా తెల్ల గులాబీలు, నాటు కాయలు, సువర్ణరేఖ, దేశవాళీ, జలాలు, ఆంధ్రా తెల్లగులాబీలు, రసాలు దొరుకుతాయి.
- పచ్చడి కాయ సైజును బట్టి రూ.15 ,20, 30 ,35, 40 చొప్పున విక్రయిస్తున్నారు. జలాలు ఒకటి రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. బెల్లం పచ్చడి కాయలు రూ. 60,70,80 చొప్పున విక్రయిస్తున్నారు.
- కాయ సైజ్‌ను బట్టి 4,5,6 చొప్పున ముక్కలు కట్ చేసినందుకు తీసుకుంటున్నారు.

సెలవు రోజుల్లోనే వ్యాపారం బాగు..



పచ్చడి మామిడి కాయల ధరలు బాగా ఉన్నాయి. అకాల గాలి వానలతో పది రోజుల్లోనే కాయల ధరలు బాగా పెరిగిపోయాయి. మార్కెట్‌కు వచ్చే పచ్చడి కాయలు తగ్గడంతో ధరలు పెరిగాయి. బాటసింగారం మార్కెట్ నుంచి ఎప్పటికప్పుడు తాజా కాయలు తీసుకువస్తున్నాం. కాయలు కొనడానికి బాగానే వస్తున్నారు. సెలవు రోజుల్లో వ్యాపారం బాగా సాగుతుంది.

–యశోద, మామిడి కాయల వ్యాపారి, నల్లగండ్ల

21 రోజుల శిశువుకు రోబోటిక్ సర్జరీ



రోబోటిక్ సర్జరీ వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఇతర డాక్టర్లు

శేరిలింగంపల్లి: దేశంలో మొట్ట మొదటిసారిగా శేరిలింగంపల్లి నల్లగండ్లలోని సిటిజన్ హాస్పిటల్‌లో 21 రోజుల శిశువుకు విజయవంతంగా రోబోటిక్ సర్జరీని డాక్టర్ మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. సిటిజన్ హాస్పిటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూరాలజీ విభాగం అధిపతి, రోబోటిక్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ద్వైపాక్షిక హైడ్రో నెఫ్రోసిస్ అని నిర్ధారణ కావడంతో రోబోటిక్ సర్జరీ చేశామని, ఇలాంటి శస్త్ర చికిత్స రోజుల శిశువుకు నిర్వహించడం దేశంలోనే ప్రథమం అన్నారు. పరీక్షల అనంతరం పాపకు కుడి సెల్విక్ యూరిటెరిక్ జంక్షన్ అడ్డంకిగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీనిని సరిదిద్దకపోతే మూత్రపిండాల పనితీరు సక్రమంగా ఉండదన్నారు. హాస్పిటల్ ఆర్‌సీఓఓ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ సిటిజన్ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు 75కు పైగా పీడియాట్రిక్ రోబోటిక్ సర్జరీలు చేసి 100 శాతం ఫలితాలు సాధించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్ జోషి తదితరులు పాల్గొన్నారు.

మండుటెండ.. వాహనదారులు విలవిల



బయోడైవర్సిటీ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ఒక వైపు ట్రాఫిక్ జామ్.. మరోవైపు భానుడి ప్రతాపంతో వాహనదారులు విలవిలలాడారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకొని నానా ఇబ్బందులకు గురయ్యారు. ఐకియా గేట్ నంబర్–1, మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ జంక్షన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాలుగు దిక్కులా ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు మూడు గంటలపాటు చర్యలు తీసుకున్నా ఓ కొలిక్కిరాలేదు. అటు పోలీసులు, ఇటు వాహనదారులు నరకయాతన అనుభవించారు.

మాజీ సర్పంచ్ వెంకటరెడ్డిపై హత్యాయత్నం



గొంతు, చేతికి గాయాలతో మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ బూరిగారి వెంకటరెడ్డి మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. వెంకట్ రెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో రోడ్డు వైండింగ్‌లో భాగంగా గుడిసెను పోగొట్టుకున్న శ్రీనివాస్ మాజీ సర్పంచ్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో శ్రీనివాస్ తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో వెంకటరెడ్డి గొంతు కోసే యత్నం చేశాడు. ఈ ఘటనలో వెంకటరెడ్డి మెడతో పాటు చేతివేలికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే గన్‌మెన్, పోలీసులు దాడికి పాల్పడ్డ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దాడికి పాల్పడ్డ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

దాడిని ఖండించిన శ్రీకాంత్ గౌడ్

ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నంను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డిని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా ప్రజల్లో ఉంటూ ప్రజా సేవకునిగా పనిచేస్తున్న ఆయనపై ఇలా దాడి జరగడం బాధాకరమన్నారు.

బీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: నాగోల్ శుభం కన్వెన్షన్‌లో ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న బీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాలను ప్రజానీకానికి తెలియజేయడమే ఈ సమ్మేళనం ఉద్దేశమన్నారు. సమ్మేళనానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మధుకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, యస్ఆర్‌కే యువసేన సభ్యులు షకీల్, రాము, ఫరాజ్, నవీన్, రాకేష్, బన్నీ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


- హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు



మాట్లాడుతున్న వీసీ

రాయదుర్గం: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ హెల్త్ సెంటర్‌లో బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌ను మంగళవారం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువకులు శరీర ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం అనే రెండు అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.అందరూ బీఎల్ఎస్, ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ సెషన్‌లో అపోలో ఆస్పత్రి డాక్టర్ అహ్మద్ అలీ, డాక్టర్ యూజిత అవగాహన కల్పించడంతోపాటు పలు సూచనలు చేశారు. హెచ్‌సీయూలోని ఉద్యోగుల పిల్లల కోసం ఈ సెషన్‌ను ప్రత్యేకంగా నిర్వహించారు. వారిలో దాదాపు 40 మందికి బీఎల్ఎస్, ప్రథమ చికిత్స శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అపోలో వైద్య బృందం, హెచ్‌సీయూ అధికారులు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 10 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందరికి నెగెటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి నిర్వహించారు.

నాలాను కబ్జా చేస్తే కఠిన చర్యలు

ఎమ్మెల్యే గాంధీ



సాయినగర్‌లో నాలాను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, అధికారులు, స్థానికులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో నాలాను మట్టితో పూడ్చుతూ కబ్జాకు పాల్పడుతున్న విషయంపై టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బందితో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలాను మట్టితో పూడ్చుతూ కబ్జాకు పాల్పడుతున్న వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా నాలాను యథాస్థితికి తీసుకురావాలని, నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. నాలాలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని, నాలాలు కనుమరుగైయితే భవిష్యత్ అంధకారమే అని అన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ సోమేష్, వీఆర్ఏ ధనరాజ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌యస్ పార్టీ నాయకులు ఎండి ఇబ్రహీం, శివ, మాధవ్, రాజ్యలక్ష్మీ, కాలనీవాసులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులతో ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు తదితరులు

దశలవారీగా శిక్షణ

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ విమెన్ సహకారంతో సాఫ్ట్‌వేర్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా నగరంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఫర్ విమెన్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించామని, దశలవారీగా మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీని ప్రారంభించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో డెంగీ నివారణపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కార్పొరేటర్ ఆర్.నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. దోమలతో పలు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం ఎస్ఈ మల్లయ్య, సీహెచ్ఓ స్వామి, నాయకులు గోపాల్, నర్సింహ, రజని తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం, క్విజ్ పోటీలు



పోటీలలో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ సబ్ యూనిట్ (తెలంగాణ ఆర్‌బీటీ హైదరాబాద్ గ్రూప్) జీ–20 యూనివర్శిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక ఉపన్యాసం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను మనూ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీ–20 దేశాల అధ్యక్ష పదవి భారత్‌కు లభించడం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా కేంద్ర విద్యాశాఖ ద్వారా జీ–20 సంబంధిత రీడింగ్ మెటీరియల్‌పై క్విజ్ పోటీలను నిర్వహించారు. మనూ ఎన్‌సీసీ కేడెట్‌లు ఈ పోటీలలో పాల్గొన్నారు. మహ్మద్, అబ్దుల్ ముజీబ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌వీ 11వ తరగతిలో ఖాళీల భర్తీకి చర్యలు

- దరఖాస్తుకు ఆఖరు తేదీ మే 31
- ప్రవేశ పరీక్ష జూలై 22న



గోపన్‌పల్లిలోని జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రధాన భవనం

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)లో 2023–24 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నారు. జేఎన్‌వీ చరిత్రలో మొదటిసారిగా 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోగా పంపాలి. నిన్నటిదాకా పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఖాళీ సీట్లు ఉంటే 11వ తరగతిలో భర్తీ చేసేవారు. అయితే ఎంపికలో మరింత పారదర్శకత పాటించేందుకే ప్రవేశపరీక్ష పెడుతున్నారు.

- 2006 జూన్1వ తేదీ నుంచి జూలై 31, 2008 మధ్య జన్మించినవారు 2022–23 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన వారు అర్హులు. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఓఎంఆర్ బేస్డ్ ఆబ్జెక్టివ్ టైప్ తరహాలో ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది. ప్రవేశ పరీక్ష జూలై 22వ తేదీన నిర్వహిస్తారు.



హఫీజ్‌పేట్ ఈర్ల చెరువు కట్టపై ఉన్న నర్సరీలో గులాబీ మొక్కలు



హఫీజ్‌పేట్ : ఇంటి అలంకరణకు రకరకాల మొక్కలు, రంగురంగుల కుండీలు వన్నె తెస్తాయి. డివిజన్ పరిధిలోని కొత్తకుంట చెరువుకట్టపై, ఆర్టీసీ కాలనీ వద్ద, జాతీయ రహదారి జెనిసిస్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన నర్సరీల్లో రకరకాల మొక్కలు, కుండీలు అందుబాటులో ఉన్నాయి. పుణె, ఏపీలోని రాజమండ్రి నుంచి మొక్కలు తీసుకొచ్చి నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. 500ల వరకు వివిధ రకాల మొక్కలు ఉంచారు.సేంద్రియ ఎరువులు, రంగు రంగుల కుండీలు, ఆయుర్వేద, పండ్ల మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. ఇంటి ఆవరణలో లాన్ గడ్డిని కూడా ఆర్డర్‌పై సప్‌లై చేస్తున్నారు. ఇన్, అవుట్ డోర్ మొక్కలు, తులసి, శంకం పువ్వులు, పారిజాతం, ఉసిరి, జమ్మి మొక్కలు ఉన్నాయి.



మంజీరా రోడ్డులో ఉన్న నర్సరీలో ఇండోర్, అవుట్‌డోర్ మొక్కలు



ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం తనిఖీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఇంటింటి ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రామచంద్రాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా శిబిరాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యసేవలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. శిబిరంలో 120 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రతీ మహిళ వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా సిబ్బంది కృషి చేయలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గాయత్రీ దేవి, డిప్యూటీ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ నాగనిర్మల, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.


కేసీఆర్ కిట్‌పై ఆరా తీస్తున్న కలెక్టర్ శరత్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

పటాన్‌చెరు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్‌చెరులోని మైత్రి మైదానంలో మండల, డివిజన్ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. మండల స్థాయిలో రాణించిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసే అవకాశం ఉండటంతో తమ ప్రతిభను చాటేందుకు యువతకు మంచి అవకాశమన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడాకారుల కోసం మూడు మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, తహసీల్దార్ పరమేశం, ఎంపీడీఓ బన్సీలాల్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, ఎంఈఓ రాథోడ్, సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అభినందన

మియాపూర్: మియాపూర్ మదీనాగూడలోని శ్రీ నారాయణ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో జయభేరి మోగించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సందడిగా 'మంకీ షోల్డర్' పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: రెస్టారెంట్స్, హోటల్స్‌లో ఉపాధి వైపు యువతను ప్రోత్సహించే నిమిత్తం ప్రముఖ బ్రాండ్ మంకీ షోల్డర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అల్టిమేట్ బార్ టెండర్ ఛాంపియన్ షిప్' పోటీలు మంగళవారం మాదాపూర్‌లోని ట్రోపో కిచెన్‌లో సందడిగా ముగిశాయి. ఈ పోటీలలో నగరానికి చెందిన ముగ్గురు యువకులు విజేతలుగా ఎన్నికయ్యారు. అతిథులకు అందించే సేవలు, వారితో ప్రవర్తన వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటూ దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, నగరాల వారీగా లీగ్ పోటీలు ముగిసిన తర్వాత ఫైనల్స్ ఉంటాయని సంస్థ ప్రతినిధులు ఆయుష్ పుందిర్, గౌరవ్ పాండేలు ఈ సందర్భంగా తెలిపారు.

తండా బాధితులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామం, ఐలాపూర్ తండాల పరిధిలోగల ప్రభుత్వ భూముల్లో దళారుల చేతిలో మోసపోయి ఇళ్లు నిర్మించిన బాధితులకు అండగా ఉంటామని, ప్రభుత్వంతో చర్చించి వారికి పూర్తి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల రెండు గ్రామాల పరిధిలో మోసపోయిన బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నవాబుల కాలంలో ఐలాపురం గ్రామ పరిధిలోని 1200 ఎకరాల భూమిని వ్యవసాయ క్షేత్రంగా వినియోగించే వారన్నారు. స్వాతంత్య్రం సిద్ధించిన అనంతరం తామే భూ యజమానులంటూ పలువురు కోర్టును ఆశ్రయించడంతో, కోర్టు స్టేటస్‌కో విధించినట్లు తెలిపారు. అనంతరం పలువురు విద్యుత్ ఉద్యోగులు సొసైటీగా ఏర్పడి రాజగోపాల్‌నగర్ పేరుతో భూములు కొనుగోలు చేశారు. ఆ సమయంలో రైతులు కేవలం వ్యవసాయం మాత్రమే చేయాలని, ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని, తుది తీర్పు వచ్చేవరకు కొనసాగించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. 2001లో తాను పటాన్‌చెరు ఎంపీపీగా ఉన్నప్పుడు అప్పటి జాయింట్ కలెక్టర్ భీం నాయక్ సమక్షంలో గ్రామ రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందడంతో, కొందరు దళారులు స్థానిక పరిస్థితులపై అవగాహన లేని వారికి తక్కువ ధరకే ప్లాట్లు అమ్ముతున్నామంటూ నిరుపేదలు, దినసరి కార్మికులు, రోజు వారీ కూలీలను మభ్యపెట్టారు. వారికి రెండు గ్రామాల పరిధిలో వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి నోటరీల పేరుతో విక్రయించినట్లు తెలిపారు. ఐలాపూర్ ఐలాపూర్ తండా పరిధిలో ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేస్తున్నారంటూ 52 మంది వ్యక్తులు ముఖ్యమంత్రి కార్యాలయం, భూ పరిపాలన విభాగం, రెవెన్యూ శాఖ, కలెక్టర్, స్థానిక అధికారులు, హైకోర్టుకు ఫిర్యాదులు చేయడం జరిగిందని గుర్తు చేశారు. వీరి ఫిర్యాదుల ఆధారంగా అక్రమంగా నిర్మించిన ఇళ్లను తొలగించాలని కోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. నష్టపోయిన నిరుపేద బాధితులందరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కోర్టు తుది తీర్పు రైతులకు అనుకూలంగా వస్తే నోటరీలపై కొనుగోలు చేసిన బాధితులందరికీ రిజిస్ట్రేషన్ చేయించడంతోపాటు, ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకంలో రూ.3 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు రెచ్చగొట్టేందుకు వస్తారని, వారి మాయ మాటలను నమ్మకుండా ఓపికతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, డీఎస్పీ భీమ్ రెడ్డి, ఐలాపూర్ సర్పంచ్ మల్లేష్, ఐలాపూర్ తండా నాయకులు రవి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: గేదె పాలు తీసుకురావడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఆదివారం గ్రామంలోని గేదెల షెడ్డు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన యువకుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఉత్తరాఖండ్ చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..బీరంగూడ పరిధిలోని శ్రీకృష్ణ దేవరాయ కాలనీ ఫేజ్–2కు చెందిన సాయి కిరణ్(23) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 6వ తేదీన ఉత్తరాఖండ్ చార్‌ధామ్ యాత్రకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. 15వ తేదీ ఉదయం సాయి కిరణ్ కుటుంబ సభ్యులకు గంగ్రోతి నుంచి రుషికేశ్ వెళ్తున్నానని సమాచారమిచ్చాడు. తిరిగి సాయంత్రం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో తండ్రి గోవింద రాజు తన కుమారుడి అదృశ్యంపై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం

నిజాంపేట్: కంటి వెలుగుతో పేద ప్రజల కళ్ల సమస్యలు తీరనున్నాయని నిజాంపేట్ కార్పొరేషన్ 21వ డివిజన్ కార్పొరేటర్ కాసాని శిరీష అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ కళ్ల పరీక్షలు చేయించుకోవాలని, సీఎం కేసీఆర్ పేద ప్రజలకు కంటి సంబంధిత సమస్యలను దూరం చేసేందుకే కంటి వెలుగును తీసుకువచ్చారన్నారు. డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ జహంగీర్, జలగం చంద్రయ్య, డివిజన్‌వాసులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం... పట్టణంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో మంగళవారం ఉదయం జాతీయ రహదారిపై పటాన్‌చెరు నుంచి హైదరాబాద్ వెళ్లే గుర్తుతెలియని వాహనం వ్యక్తి (60)ని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డయల్ 100 ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీస్‌స్టేషనులో సంప్రదించాలన్నారు.











